## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ జి.సాంబరెడ్డి తెలిపారు. హంటర్ రోడ్డు సిటిజన్ క్లబ్, మెడీకవర్ హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, నందిహిల్స్, జూపార్కు, హంటర్ హిల్స్, అర్కా స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ఖర్గేను కలిసిన ఎంపీ కావ్య



హన్మకొండ చౌరస్తా: వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్య.. తన తండ్రి ఎమ్మెల్యే శ్రీహరితో కలిసి ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పార్లమెంట్‌లో ఎంపీగా డాక్టర్ కావ్య తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. జై భీం, జై భద్రకాళి, సేవ్ కానిస్టిట్యూషన్ అంటూ ప్రమాణ స్వీకారాన్ని ముగించారు.

### బ్యాడ్మింటన్‌లో సుకృతికి గోల్డ్‌మెడల్స్



రామన్నపేట: నగరంలోని కిట్స్ కళాశాలలో ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఎల్‌బీ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సుకృతి.. మహిళల సింగిల్స్, అండర్ -19 బాలికల సింగిల్స్ విభాగాల్లో గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఈమేరకు కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సుకృతిని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేందర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఈ.రాజేందర్, చైర్మన్ నిరంజన్, గేమ్స్ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, శృతి, రజిని, సునీత అభినందించారు.

### అడ్డా కూలీలకు బతుకు భరోసా కరువు



కాజీపేట: దినదిన గండంగా బతుకులీడుస్తున్న అడ్డా కూలీలకు ప్రభుత్వం నుంచి బతుకు భరోసా కరువైందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి ఆవేదన వ్యక్తం చేశారు. కాజీపేట పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక శాఖలో పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల దరఖాస్తులను పరిష్కరించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలోతు శంకర్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కరాజు గౌడ్, పూర్ణచందర్, లక్ష్మి, కల్యాణి, మేరీ పాల్గొన్నారు.

### భద్రకాళిని దర్శించుకున్న జనగామ అడిషనల్ కలెక్టర్

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి అమ్మవారిని జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. అంతకుముందు కలెక్టర్‌కు ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు ఆలయంలోకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆలయ ప్రధాన అర్చకుడు శేషు అందజేశారు.

### కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షురాలిగా స్వాతి



హసన్‌పర్తి: కాంగ్రెస్ హసన్‌పర్తి మండల ఉపాధ్యక్షురాలిగా 65వ డివిజన్ మునిపల్లికి చెందిన బత్తుల స్వాతి నియమితులయ్యారు. ఈమేరకు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ ప్రకటించారు. సుబేదారిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్వాతికి మంగళవారం జరిగిన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు నియామక ఉత్తర్వులు అందించారు.

### పారిశుద్ధ్య పనులు

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో బల్దియా అధికారుల ఆధ్వర్యంలో ప్రధాన డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం తొలగించారు. స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, జవాన్ ప్రశాంత్, వీర మల్లయ్య, అశోక్, మల్లయ్య, జ్యోతి పాల్గొన్నారు.

# ప్రవళిక కుటుంబానికి భరోసా ఏదీ..?

**నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ అందరి నోట్లో ఇదే పేరు**

- దుగ్గొండి మండలం బిక్కాజిపేటకు ప్రముఖుల రాక
- ప్రియాంకగాంధీ దూతగా వచ్చిన అప్పటి యూపీ ఎంపీ డాలీశర్మ
- మీకు అండగా ఉంటామంటూ మా నేత పంపారని సందేశం
- ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పుడు భావోద్వేగ ట్వీట్
- కుటుంబానికి న్యాయం చేయాలంటూ ప్రవళిక తల్లిదండ్రుల వేడుకోలు
- కూలీ పనులకు వెళ్తూ జీవనం వెళ్లదీస్తూ కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం



ప్రవళిక కుటుంబాన్ని ఓదారుస్తున్న ఉత్తరప్రదేశ్ ఎంపీ డాలీశర్మ (ఫైల్)



ప్రవళిక చిత్రపటం పట్టుకొని ఆదుకోవాలని కోరుతున్న తల్లిదండ్రులు

**అసలేం జరిగిందంటే...**

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవళిక పోటీ పరీక్షల కోసం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో కోచింగ్ తీసుకుంటున్న క్రమంలో పోటీ పరీక్షల పేపర్లు లీక్ కావడంతో విరక్తి చెందిన ఆమె 2023 అక్టోబర్ 13న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రవళిక మృతితో అక్కడే వివిధ కోచింగ్ సెంటర్లలోని నిరుద్యోగ యువతీ యువకులు నిరసనకు దిగారు. అప్రమత్తమైన అప్పటి ప్రభుత్వం ప్రవళిక మృతదేహాన్ని భారీ పోలీసు బందోబస్తు మధ్యన స్వగ్రామం బిక్కాజిపల్లి గ్రామానికి తీసుకువచ్చి వందలాది మంది పోలీసుల పహారా మధ్యన అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల సందర్భంలో వేలాది మంది విద్యార్థులు వచ్చి ఆందోళన చేపట్టినా పోలీసులువారిని తోసివేశారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు సైతం వచ్చి ఆందోళన నిర్వహించారు.

సాక్షి, వరంగల్/దుగ్గొండి: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ మర్రి ప్రవళిక ఆత్మహత్య రాష్ట్రాన్నే కాదు దేశంలోనే సంచలనంగా మారింది. ప్రధాని మోదీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతోపాటు తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి,బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ల నోటి వెంట రాజకీయ ఎన్నికల ప్రచారంలో ఆమె పేరు మార్మోగింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రూప్ పరీక్షల విధానంలో ఆలసత్వం వల్లే ఆమె ఆత్మహత్య చేసుకుందని, నిరుద్యోగులు ఎవరూ అధైర్యపడొద్దని తమ ప్రభుత్వాలు రాగానే ఠంచన్‌గా పరీక్షలు నిర్వహిస్తామని యువతను ఆకట్టుకుంది. అదే సమయంలో ప్రవళిక కుటుంబాన్ని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదుకోవాలని,ఆమె కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించడంతోపాటు ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశాయి. అదే సమయంలో రాబోయే తమ ప్రభుత్వం ద్వారా ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని బాహాటంగానే ప్రకటించాయి. అలా వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బిక్కాజిపేటకు చెందిన ప్రవళిక పేరును వాడుకొని ఆయా పార్టీలు మద్దతు కూడగట్టుకున్నాయి. ఇక్కడివరకు బాగానే ఉన్నా అప్పటి వరకు ప్రతిపక్షంలో ఉండి ప్రవళిక కుటుంబాన్ని ఆదుకోవాలన్న కాంగ్రెస్, బీజేపీ నేతలు కనీసం ఇప్పుడు ఆ కుటుంబంవైపు చూడకపోవడంతో కన్నీరుమున్నీరవుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగిన ప్రవళిక తండ్రి విసిగివేసారి కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 28న ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి వరంగల్‌కు రానున్న సందర్భంలో తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

**ప్రియాంక గాంధీ దూత వచ్చినా..**

అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 45 రోజుల గడువు ఉండగా ప్రవళిక మృతిని అప్పటి ప్రతిపక్షం, నేటి అధికార పక్షం కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీలు అనుకూలంగా మలచుకున్నాయి. ప్రవళిక మృతిని దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసి నిరుద్యోగ యువతీయువకుల మద్దతును కూడగట్టాయి. అప్పటి అధికార పక్షం, నేటి ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సైతం ప్రవళిక మృతిని పెద్దది చేయకుండా ప్రవళిక తల్లిదండ్రులతో మాట్లాడి ప్రవళిక సోదరుడికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం మారడంతో ఆ పార్టీ నాయకులు చేతులు ఎత్తివేశారు. ప్రవళిక మృతి సమయంలో ప్రియాంకగాంధీ దూతగా ఉత్తరప్రదేశ్ ఎంపీ డాలీశర్మ స్వయంగా అక్టోబర్ 15న బిక్కాజిపల్లికి వచ్చి ప్రవళిక తల్లిదండ్రులతో మాట్లాడారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 'ప్రియాంకగాంధీ నీకు తోడుగా ఉంటానని చెప్పమని నన్ను పంపింది'అని డాలీశర్మ ప్రవళిక తల్లి విజయకు చెప్పారు. ఇదే సమయంలో పీసీసీ అధికార ప్రతినిధి, నేటి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ స్వయంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో ప్రవళిక తల్లిదండ్రులు లింగయ్య, విజయలతో మాట్లాడించారు. 'పోయిన బిడ్డను తెచ్చి ఇవ్వలేం.. అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి'అని ధైర్యం చెప్పారు. నేడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఏడు నెలలు దాటింది. ప్రవళిక కుటుంబం.. ముఖ్యమంత్రికి గుర్తుకు రాలేదా అంటూ విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. నాటి నేటి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దూతలుగా వచ్చి మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్‌లు నేడు ప్రవళిక కుటుంబ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకెళ్లడం లేదని నిరుద్యోగ యువత ప్రశ్నిస్తుంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు స్పందించి ప్రవళిక సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

**కూలీ పనులకు వెళ్తున్నా...**

నా బిడ్డ చనిపోయి ఎనిమిది నెలలు దాటుతుంది. బిడ్డ చనిపోయినప్పుడు వేలాది మంది రోజు వచ్చిండ్లు. ఆదుకుంటామని ధైర్యం చెప్పిండ్లు. మీటింగ్‌లల్ల నాబిడ్డ పేరు చెప్పని నాయకుడు లేడు. ఎన్నికలు అయిపోయినయి. నన్ను ఎవళ్లూ పట్టిచ్చుకుంటలేరు. చానామంది నాయకుల దగ్గరికి తిరిగిన. కాళ్లు ఏళ్లు మొక్కినా కనికరం లేదు. అప్పుడు ఇప్పుడు అంటున్నరు. బిడ్డ పోయినందుకు కొడుక్కు ఉద్యోగం ఇస్తం అన్నరు. ఇప్పుడు ఎవళూ ఏమీ చెబుతలేరు. రెక్కాడితగాని డొక్కాడదు. అందుకు రోజు కూలీ పనులకు పోతున్న. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంతరెడ్డి సారు నా కొడిక్కి ఉద్యోగం, నాకు ఆర్థికసహాయం చేసి ఆదుకోవాలే.

- మర్రి లింగయ్య, ప్రవళిక తండ్రి, బిక్కాజిపల్లి

**నిందమోపిండ్లు.. రుజువు చేయలే..**

నాబిడ్డ చదువులో చాలా తెలివిగలది. ఏనాటికైనా గవర్నమెంట్ ఉద్యోగం సాధిస్తా అన్నది. ఉద్యోగం వచ్చినంకనే పెళ్లి అన్నది. పరీక్షల పేపర్లు లీక్ కాంగనే రంది పడ్డది. మళ్ల ఎప్పుడు పెడుతరో.. నౌకరి వస్తదో రాదో అని మదనపడేది. గుండె ధైర్యం చెడి ఆత్మహత్య చేసుకున్నది. చావుకు ప్రేమ కథ అల్లిండ్లు. నింద మోపిండ్లు. ఇప్పటికి రుజువు చేయలే. కడుపు కాలుతుంది. క్షణంక్షణం బిడ్డ యాదికోస్తుంది. ఇప్పుడు మా ఇంటి వంక ఎవ్వలూ చూడటం లేదు. నా బిడ్డ పేరు చెప్పుకుని ఓట్లు సంపాదించుకున్నరు. గద్దెలు ఎక్కిండ్లు. నా బిడ్డ ఇప్పుడు ఎవ్వరికి గుర్తుకు లేదు.

- మర్రి విజయ, ప్రవళిక తల్లి, బిక్కాజిపల్లి

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో సదుపాయాలు కల్పించాలి





డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని సూచించారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహరావు మాట్లాడుతూ రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. నర్సయ్య, రాజ్‌కుమార్, ఉదయ్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి**

జిల్లాలో అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యను వ్యాపారం చేస్తున్న స్కూళ్ల గుర్తింపును రద్దుచేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని అనుమతి లేకుండా నడుపుతున్న పాఠశాలల వివరాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్ యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి బాలగోని రాకేష్, నాయకులు మహేష్, రాజేష్, వెంకటేష్, రంజిత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంకటహర చతుర్థి ప్రత్యేక పూజలు



కాజీపేటలో గణపతి హోమం చేస్తున్న భక్తులు

మడికొండ: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఉన్న విజయగణపతి ఆలయంలో మంగళవారం సాయంత్రం పంచామృతాభిషేకాలు, గరికలతో విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పరశురాం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, మంత్రోచ్ఛరణల మధ్య గరికలతో వైభవంగా పూజలు నిర్వహించారు. కార్యనిర్వాహణాధికారి కే.శేషుభారతి, పైడిపాల రఘుచందర్, బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

**63వ డివిజన్‌లో..**

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు గణపతి హోమం చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేసి వెండి తొడుగులతో ప్రత్యేకంగా అలంకరించారు.

## 'అంబేడ్కర్ భరోసా'ను అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఫ్రంట్ నాయకులు

హన్మకొండ: అంబేడ్కర్ అభయ హస్తం (భరోసా) పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సమగ్ర అభివృద్ధి, భద్రతపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్లలో జరిగిన సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించి అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని గుర్తుచేశారు. ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతం పెంచుతామని, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వేర్వేరుగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శులు చుంచు నరేష్, మేకల అనిత, జిల్లా సహాయ కార్యదర్శి పోలెపాక మల్లేశం, న్యాయవాది కలకోటి మహేందర్, నాయకులు అయిలయ్య, రాజు, సురేందర్, క్రాంతి, సామాజిక కార్యకర్త కేడల ప్రసాద్ పాల్గొన్నారు.

## రేపు కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మికులు

హన్మకొండ: హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ఈనెల 27న జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు ధర్నా కరపత్రాలను హనుమకొండ 4వ డివిజన్ కేయూసీ రోడ్డు, 6వ డివిజన్ కుమార్‌పల్లిలో మున్సిపల్ కార్మికులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన పీఆర్సీలో రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు చెప్పులు, చీపుర్లు, పారలు, గడ్డపారలు, గ్లౌజులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లయ్య, గణేష్, దామోదర్ పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన భూములను గుర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాజీపేట అర్బన్: గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్ ల్యాండ్స్, సీలింగ్ ల్యాండ్స్‌ను గుర్తించి వెనక్కి తీసుకుని హద్దులు నిర్ణయించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ బావుసింగ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, 62వ డివిజన్ అధ్యక్షుడు పొలడుగుల ఆంజనేయులు, ఇప్ప శ్రీకాంత్, 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, చిలకపాటి శివ, మానస, మధు, కొండా శివ, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో క్రమశిక్షణ పెంపు

హసన్‌పర్తి: క్రీడలతోనే క్రమశిక్షణ పెంపొందుతోందని వరంగల్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ ఎం.రవీందర్ రెడ్డి అన్నారు. కిట్స్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యానికి క్రీడలు ఎంతోగానో దోహదపడుతాయన్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ క్రీడాకారులు తమ క్రీడ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, అసోసియేషన్ సభ్యులు డాక్టర్ మోహన్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్ రావు, కృష్ణవేణి, శైలజ, శ్యామ్, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

### ఏఐఎస్‌బీ ఆవిర్భావ వేడుకలు

దేశాయిపేట: అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఏఐఎస్‌బీ జెండాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1951లో కలకత్తాలో ఏఐఎస్‌బీని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాల సాధనకు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 74 ఏళ్లుగా దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు జి.ప్రవీణ్, అఖిల్, ఫుర్కాన్, యాకూబ్, రవి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ ఉద్యమకారులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎమర్జెన్సీ ఉద్యమకారులు

హన్మకొండ: తమను ప్రభుత్వం గుర్తించాలని ఎమర్జెన్సీ ఉద్యమకారులు కోరారు. హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీహెచ్.శ్యాంప్రసాద్, బూర రాంచందర్‌తో పాటు ఎమర్జెన్సీ ఉద్యమకారులు మాట్లాడారు. 1975, జూన్ 25న కేంద్రంలోని అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ పెట్టిందని గుర్తుచేశారు. అది ఒక కాళరాత్రి అని వాపోయారు. ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లవుతోందని చెప్పారు. ఆరోజు ప్రభుత్వం జరిపిన దారుణ మారణకాండ ఉదంతం నేటి తరానికి తెలియదన్నారు. సమావేశంలో ఉద్యమకారులు కె.కోటేశ్వర్ రావు, జి.మనోహర్, మార్గం ఎల్లయ్య, ఎం.అశోక్ రెడ్డి, నర్సింగరావు, బి.సారయ్య, నాగభూషణం, ఎ.చిలుకయ్య, బూర రాంచందర్, పి.కేశవరెడ్డి, నరెడ్ల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## 7న మాదిగల ఆత్మగౌరవ కవాతు



మాట్లాడుతున్న ఎంఎస్‌పీ నాయకుడు సూరన్న

హసన్‌పర్తి: వచ్చే నెల 7న లక్షల జెండాలు, తెల్ల చొక్క, నల్ల పాయింట్‌తో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న తెలిపారు. మండల కేంద్రంలోని ఇందిర కాలనీలో హసన్‌పర్తి గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కవాతు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజారపు భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జన్ను దేవేందర్, పుల్లా నరేష్ పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

ఎమ్మార్పీఎస్ హసన్‌పర్తి శాఖ అధ్యక్షుడిగా ఆకునూరి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా శివాజీ, అధికార ప్రతినిధిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా తాళ్ల తిరుపతి, కోశాధికారిగా శేఖర్ ఎన్నికయ్యారు.

## 'పాపయ్య' సేవలు చిరస్మరణీయం



పాపయ్యకు నివాళులర్పిస్తున్న కళాకారులు

హన్మకొండ కల్చరల్: సరస్వతి నాట్యమండలి వ్యవస్థాపకుడు సామల పాపయ్య గొప్ప కళాకారుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని ఉమ్మడి వరంగల్ జిల్లా రంగస్థల పద్మనాటక కళా పరిషత్ అధ్యక్షుడు మారేడోజు సదానందాచారి అన్నారు. పాపయ్య హనుమకొండ జిల్లా కొప్పుల గ్రామంలో ఈనెల 20వ తేదీన అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఈమేరకు వరంగల్‌లోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఉమ్మడి జిల్లా రంగస్థల పద్య నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సంతాపం తెలిపారు. వైకుంఠం, సారంపాణి, లక్ష్మణమూర్తి, బాబురావు, పోతనాచారి, అక్బర్‌పాషా, బాబు, సమ్మయ్య, భిక్షపతి, మొగిలి, లింగమూర్తి, రాజలింగం, కుమారస్వామి, సదానందం, రవీందర్‌రావు, రమేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### శరీరదాత శ్రీలక్ష్మి సంస్మరణ సభ

హన్మకొండ కల్చరల్ / రామన్నపేట: శరీర దాత తిరుకోవళ్లూరు శ్రీలక్ష్మి సంతాప సభను హనుమకొండలోని మీనాక్షి ఫంక్షన్ హాల్‌లో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరీరదాత బంధు మిత్రులకు నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథులుగా సదాశయ ఫౌండేషన్ సలహాదారులు రాజేంద్రకుమార్, శ్రీలేఖ సాహితి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీరంగస్వామి, ప్రొఫెసర్ శ్యామల, అనిశెట్టి రజితాదేవి హాజరై లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నందకిశోర్, శ్రవణ్‌కుమార్, బన్న అయిలయ్య, రామారావు, గిరిజా మనోహరాచార్యులు, శ్రీధర్, అనిశెట్టి రజితాదేవి, శ్యామల, కిశోర్ పాల్గొన్నారు.

## ఎల్లమ్మతల్లి తిరుగు వారోత్సవం



కాజీపేట: 62వ డివిజన్ సోమిడి శివారులోని రేణుక ఎల్లమ్మతల్లి తిరుగు వారోత్సవాలను భక్తులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గౌడ సంఘం మహిళలతో పాటు స్థానికులు ఎల్లమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శంకరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారితో పాటు కాటమయ్యను ప్రత్యేకంగా అలంకరించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సంఘం బాధ్యులు బొల్లికొండ ఉపేందర్, చిర్ర నర్సింగ్ గౌడ్, వెంకటేష్, బస్వా యాదగిరి, బుర్ర బాబురావు, కాటపురం రాజు, చిర్ర విజయ, తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కేయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఈమేరకు విద్యార్థులు, పరిశోధకులు శ్రమదానం చేసి హరితహారం కింద మొక్కలు నాటారు. ఆ విభాగం ప్రొఫెసర్ యాదగిరిరావు, అధ్యాపకులు శ్రీనివాస్, చీకటి శ్రీను, ఉమాశంకర్, మోహన్ పాల్గొన్నారు.